# మైసెన్సు బిళ్ళ

## పోతుకూచి వెంకటేశ్వర్లు

ఆ రాత్రి ఇద్దరికి నిద్రలేదు. చెప్పిందే మళ్ళీ-మళ్ళీ చెబుతూ తెల్లవార్లు ఏదో రొద చేస్తూనే వుంది పార్వతి.

అసలే వానాకాలం–రాత్రిళ్ళు స్వెట్టరు వేసుకోవటం మరిచిపోకండి. అన్నట్లు తెల్లవారుఝామున మీరు అనుపానాధికి లేచినప్పుడు వీధి గేటుతాళం తీసివచ్చి పడుకోండి.

చిట్టి తెల్ల వారకుండానే వచ్చేస్తుంది. వీధిపని–పాచిపని చేసేటప్పటికి తెల్లవారుతుంది. వచ్చేటప్పుడే పాలసీసా తెమ్మని చెప్పాను. అన్నట్లు సాయంత్రం దానికి నూట ఆరవై పైసలు చిల్లరగా ఇవ్వండి. ప్రొద్దున్నే వస్తూవస్తూ పాలసీసా తెచ్చేస్తుంది.

లేవగానే స్టౌమీద పాలుపెట్టి మొఖం కడుక్కునే లోపల పాలు పొంగుకొస్తాయి. హాయిగా కాసిని పాలల్లో నెస్‌కేఫ్ పంచదార చెరో రెండు చెంచాలు కలుపుకు త్రాగండి, హోటలు కాఫీ వొద్దు. మీకు పడదు. అన్నట్లు ఈ నెల పంచదారకోటా ఇంకారాలేదు. రెండు మూడు రోజులు పోయింతర్వాత చిట్టిని కనుక్కోమనండి. అదే తెస్తుంది.

ఒక్కరేగా స్టౌమీద కాసిని వేడినీళ్ళు పెట్టుకుంటే సరి. బద్ధకించేరుగాని, చన్నీళ్ళ స్నానం చేస్తే జలుబు చేస్తుంది. అసలే వర్షాకాలం.

వానలో తడవకండి. అంతగా అయితే వాన వెలిసే వరకు ఎక్కడన్నా ఆగండి. అంతగా ఎడతెరిపి లేకుండా వుంటే మరీపొద్దుపోయే వరకు ఆఫీసులో జాగారణ చేయకుండా రిక్షామీద యింటికి వచ్చేయండి.

మరిచేపోయాను చూసారా-అసలు విషయం రెండు పూటలకు కలిపి ఒకేసారి ఆ తెసరు పడేసుకోవచ్చు. వానాకాలమేగా. అన్నం ఏమీ పాడవదు–అయితే ఆఫీసుకువెళ్ళేటప్పుడు అన్నం గిన్నె నీళ్ళుపోసిన పళ్ళెంలో పెట్టి-అలమారులో పెట్టండి–అప్పుడు చీమలు పట్టవు. ఎలుకలు ఏమీ చెయ్యలేవు.

ఏమిటో-చూచారా-అన్నీ మరిచేపోతున్నా-కాఫీ త్రాగగా మిగిలిన పాలల్లో యింత తోడు పడెయ్యండి. మీరు వచ్చేటప్పటికి చిక్కని మీగడ పెరుగు రడీగా వుంటుంది. నేను లేను కదాఅని సినిమాలు-షికార్లు...

**పార్వతి కాపరానికి వచ్చింతర్వాత – వేరింటి కాపరం నేను ఆఫీసుకు వెళ్ళినా తోడుగా వుంటుందని అన్ని పనులకు అక్కరకు వస్తుందని చిట్టి తల్లే చిట్టిని మాయింట్లో కుదిర్చింది. చిట్టికి చేతకాని పనంటూలేదు.**

"అబ్బబ్బ ఏమిటే పార్వతీ ఏదో ఫారిన్ వెళ్తున్నట్లు"

"మీకు ఎగతాళిగానే వుంటుంది–రెండురోజులు పోయేటప్పటికి తెలుస్తుంది"

రెండేళ్ళలో ఎంత దగ్గరైపోయింది పార్వతి. యిరవై సంవత్సరాలు కన్నవారింట్లోవుండొచ్చిన పార్వతి పురిటికని తిరిగి యిన్నాళ్ళకు పుట్టింటికి వెళ్ళాల్సివస్తే ఎన్ని అప్పగింతలు చెబుతోంది

అదే యింకొకళ్ళయితే యీమధ్య కాలంలో పుట్టింటికి వెళ్తానని ఎన్నిసార్లు మారాంచేసేవారో–అలాంటిది కాపరానికి వచ్చింతర్వాత యిన్నాళ్ళకి నెలలునిండుతుంటే తప్పనిసరై పుట్టింటికి వెళ్ళాల్సి వస్తున్నందుకు యింతగా యిదైపోతుందేమిటి పార్వతి.

అలా అన్నానేగాని వెళ్ళేటప్పుడు మామగారు సామాను రిక్షాలోసర్ది "అమ్మాయ్ త్వరగారా టైమ్ అవుతోంది" అని పిలిచినప్పుడు వొంగలేక వొంగలేక నా కాళ్ళకు దండంపెడుతున్న పార్వతి తలమీద అనుకోకుండానే కన్నీటిబొట్లు పడ్డాయి.

"ఏమిటి? ఏడుస్తున్నారా? యీ మాత్రానికే యిలా అయితే ఎలా చెప్పండి?"

"లేదు పార్వతి–లేదు కొన్ని నెలలేగా— రెండు మూడు నెలల్లో పురుడు వస్తుంది. మరో రెండుమూడు నెలల్లో ముద్దులొలికే పాపాయితో తిరిగి వచ్చేస్తావుగా"

అంటూనే యిద్దరం వీధిలోకి నడిచాం.

"అన్నట్లు కూరగాయలు అన్నీ వున్నాయి. పచ్చడి ఏమన్నా కావాలన్నా–పోపు వేయించాల్సి వచ్చినా చిట్టికి చెప్పండి. అది చేసి పెడుతుంది. నేను దానికి అన్నీ చెప్పానులెండి. వచ్చింతర్వాత చీర పెడతానని ఆశకూడా పెట్టానులెండి."

రిక్షా కదిలింది.

మరుసటిరోజు చిట్టి తనపని తను చకచకా చేసుకుపోతోంది యాంత్రికంగా

అన్నట్లు చిట్టి ఎవరో చెప్పలేదుకదూ !

మూడు తరాలనుంచీ దాని పూర్వీకులకీ–యీ యింటికీ బంధంవుంది. దాని తల్లి– తల్లి గారిలు యీ యింట్లో మొదటిసారిగా మా తాతలనాడు పనికి కుదిరింది. అప్పటినించి యింతవరకు వాళ్ళే యీ యింటిపని యీవత్తూ చేస్తున్నది.

పేరుకు పనిమనిషేగాని–యింట్లో మనుష్యుల్లా మసులుతారు.

పార్వతి కాపరానికి వచ్చిం తర్వాత– వేరింటి కాపరం. నేను ఆఫీసుకు వెళ్ళినా తోడుగా వుంటుందని–అన్నిపనులకు అక్కరకు వస్తుందని చిట్టి తల్లే చిట్టిని మా యింట్లో కుదిర్చింది.

చిట్టికి చేతకాని పనంటూలేదు.



కలాబు చల్లటం దగ్గర్నుంచి రేడియో పెట్టటం వరకు. పార్వతికి నీళ్ల తోడటం దగ్గర నుంచి నా జోళ్ళకు పాలిష్ చేయటంవరకు.

రోజులో చాలాభాగం మా యింటిలోనే గడిపేది. కొంతప్పుడు మధ్యాహ్నం యిక్కడే తిని పార్వతికి తోడుగా వుండేది. ఎంతోసమ్మకస్థురాలు. ఏమీ కావాలని అడిగేది కాదు. ఏదైనా పెడితే తప్ప తినేదికాదు.

అందుకే ఓ విధంగా పార్వతి వెళ్ళుతూ చిట్టికి అన్ని పనులూ పురమాయించి— జాగ్రత్తగా కని పెట్టి వుండమని చెప్పింది ఆ విషయం పార్వతే నాకు స్వయంగా చెప్పింది

"అయ్యగోరూ-యింకా లేవకపోతే ఎలాగా? చూడండి ఎంతగా తెల్లారిందో—నీళ్ళు కూడా కాస్తిని..." అనే చిట్టి మాటలకు లేవక తప్పేది కాదు.

మొదట్లో కొంచెం బద్ధకం అనిపించినా- పట్టుదలతో అన్నీ స్వయంగా నేనే చేసుకునేవాడిని· అయితే రానురాను బద్ధకంతో అన్నీ చిట్టినే చేయమంటూ వచ్చా. అయినా దేనికి మొరాయించకుండా అన్నీ చక్కబెట్టేది చిట్టి.

ఉదయం, సాయంత్రం- రెండు పూటలా యింటిని శుభ్రంచేసి నాకు కావలసినవన్నీ అమర్చి వెళ్ళేది.

వానాకాలంకదూ! ఆ రోజు ఉదయంనుంచి వచ్చే తుంపర పోయేతుంప*గావున్నా సాయంత్రానికి వాన జల్లు పెరిగింది. ఆ జల్లోనే గోనెపట్టా కప్పుకుని చిట్టి వచ్చింది.

"ఎందుకే యింత వానలో రాకపోతేనేం? ఓ పూటకి..." నా మాట పూర్తికాకుండానే

"మీరలాగే అంటారు. రేపు అమ్మగారువొచ్చినాక నేనేం చెప్పుకోను—"అంటూ కుచ్చెళ్లు పిండుకుని యింట్లో పని మొదలుపెట్టింది.

నేను మాత్రం టేప్‌రికార్డు పెట్టుకుని హాయిగా వింటూ—వీధి ద్వారంకుండా వానజల్లు పడే తీరును తిలకిస్తూ, పులకిస్తున్నా.

పని అయిపోయింది గాబోలు- వీధి తలుపు దగ్గరకుచేరిన చిట్టి వానజల్లును చూసి జంకింది.

"వెధవ వాన. పొద్దుట్నుంచీ వానే..." అంటూ విసుక్కుంది. ఇంతలో గాలి వాటానికి ఓ జల్లు తుంపరగా వచ్చి దాని మొహాన్ని తాకింది.

"చూసారా అయ్యగోరూ—యీ ఈదురు"

"తలుపు దగ్గరగావేసి అలా కూర్చో— వాన వెలిసింతర్వాత వెళ్లొచ్చు" అనాలోచితంగానే అన్నాను.

చిట్టి అలాగే చేయబోయి— తలుపురెక్క దగ్గరగా వేసి, నేనుతిరిగేసరికి—గడియ పెట్టలేదేమో- ఈదురుగాలికి రివ్వున రెక్క దాని వీపుకి తగలటం- ఆ తాకిడికి అది ముందుకు పడబోయి ఎదురుగా యీజీఛైర్లోవున్న నా వొడిలో వాలటం అనుకోని సంఘటన.

దాన్ని వొడిమి పట్టుకున్నాను.

అంతే నరాలు జివ్వుమన్నాయి!

ఏదో మైకం!

ఆ మగతలో ఎంతకాలం గడిచిందో!

తెలివి తెచ్చుకునేసరికి- సిగ్గుతో యిద్దరం తలలు వాల్చుకున్నాం. ముందుగా చిట్టే తేరుకుంది. చీర సరిచేసుకుని, మంచం దిగి, గబగబా వెళ్ళి- బార్లా తెరిచిన ద్వారబంధానికి ఆనుకుని కూర్చుంది.

ఇంతలో వాళ్ళ నాయన తాటాకుగొడుగు సహాయంతో అక్కడికి వచ్చాడు. "యిక్కడే వున్నావుగదా! ఏమైనావోనని వెతుక్కుంటూ వచ్చా..." అంటున్న తండ్రితో.

"యీ వానలో నువ్వు రాకపోతే ఏం? తడా రాక నేనే వొచ్చేదాన్నిగా!" అంటూ తండ్రితో వెళ్ళిపోయింది.

తర్వాత ఆ రాత్రి నిద్రలేదు నాకు.

అయితే తెల్లారేసరికి చిట్టి వచ్చి-అసలు ఏమీ జరగనట్లే అన్ని పనులూ చేసుకుపోతోంది. ఆశ్చర్యం వేసింది. కొంత మనశ్శాంతి కలిగింది.

అయితే ఆ తర్వాత అప్పుడప్పుడు యిద్దరం యిష్టపూర్వకంగానే కొన్ని మధురానుభూతులు అనుభవించాం.

ఉన్నట్టుండి ఓనాడు చిట్టే అంది.

"అమ్మగారు ఎల్లుండి వస్తున్నారటగదా బాబుగారూ..."

"అవునే—అయితే మాత్రం ఏం? నువ్వూ మాతోబాటే— మాలో వొకరిగా వుండిపోదువుగాని..." అన్నానేగాని లోపల ఓ జంకు బయలుదేరింది.

అనుకున్నట్లుగానే పార్వతి వచ్చింది.

నా యోగక్షేమాలు కనుక్కుంది. విసుకున్నా విడపకుండా ఏ రోజున ఏం తిన్నది- ఎప్పుడు పండుకున్నది—ఎప్పుడుపడుకున్నది-అన్నీవాకబు చేసింది.

కొత్తలో లేనిది-చిట్టిలో కొంత మార్పు నేను యీ కాలంలో- అది సాయంత్రం వేళలో పసికట్టాను.

కారణం అడుగుదామనుకుంటుండగానే అసలు చిట్టి రెండురోజులుగా కనబడటమే మానేసింది.

మూడోరోజున కాబోలు పార్వతినే అడిగాను.

"అవునూ- చిట్టి కనబడటం లేదేమిటి? అసలు పనిలోకి వస్తోందా?"

"లేదు- నేనే మాన్పించేసాను."

నా నెత్తిన పిడుగుపడినట్లయింది. కళ్ళు బైర్లు కమ్మాయి. ఏదో అనాలని పెదాలు తడుపుకునే లోపల-

బయటనుంచి అరుస్తూ వచ్చాడు ఎదురింటాయన.

"యీ మునిసిపాలిటీ వాళ్ళతో యిదే గొడవ..."

"ఏం జరిగింది మేష్టారూ..."

"మీ డిపార్టుమెంటు ఏదైనా చేస్తుంది."

నేను మునిసిపాలిటీ ఆఫీసులో ఓ గుమస్తాగిరీ వెలగబెడుతున్నా— అందుకని మునిసిపాలిటీకి సంబంధించినంతవరకు ఆ వీధిలో నేనే అధికారిని అనే ధోరణిలో అక్కడివాళ్ళు మాట్లాడుతారు.

"యింతకీ ఏం జరిగిందండీ"

"యింతకంటే ఏం జరగాలి? మా పెంపుడుకుక్క లేదూ-చిట్టిముండ-ఎంత ముద్దుగావుండేది! ప్రొద్దస్తమానం యింట్లోనే పడివుండేది ఖర్మ కాలి దేనికి వెళ్ళిందో-నిన్న సాయంత్రం ఓ క్షణం పాటు వీధిలోకి వెళ్ళినట్లుంది. అంతే రెప్పపాటున మీ మునిసిపాలిటీవాళ్ళు ఉచ్చేసి లాక్కెళ్ళారుట- ఏమైందోనని అటు-యిటు తెగతిరుగుతుంటే— పక్కింటివాళ్ళ పిల్లాడు యీ పూట చెప్పాడు.

అది మంచిదేకదా! మా పెంపుడుకుక్క అని తెలిసికూడా—

లైసెన్సు బిళ్ళ దానిమెళ్లో కట్టనంత మాత్రాన..."

ఆ పైన ఏమి చెబుతున్నది నాకు వినిపించలేదు. ✱



## పేర్లు?

"స్టీలుగిన్నెలమీద పేర్లు ఎందుకు వేయిస్తారు?" అడిగింది రేఖ, రాధని.

"గిన్నెలు పక్కింటి వాళ్ళు తీసికెళ్ళి ఇవ్వరు. కొన్నాళ్ళు పోయాక పేరు చెప్పి మనమైనా తెచ్చుకోవచ్చు ఇలా అయితే" అంది రాధ.

—కె. లక్ష్మణ్ ప్రసాద్ (విశాఖపట్నం)

కొనాలి —మల్లిక్

